క్లుప్తంగా

సీఐ బాధ్యతల స్వీకరణ


క్రిష్ణయ్య

బనగానపల్లె రూరల్: బనగానపల్లె అర్బన్ సీఐగా క్రిష్ణయ్య శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేసిన గంటా సుబ్బారావు కర్నూలు జిల్లా ఆదోని ట్రాఫిక్ సీఐగా బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో అన్నమయ్య జిల్లా దిశ పోలీస్‌స్టేషన్ సీఐగా విధులు నిర్వహిస్తున్న క్రిష్ణయ్యను ఇక్కడికి బదిలీ చేశారు. పోలీసు సిబ్బంది, ప్రజల సహకారంతో సర్కిల్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని నూతన సీఐ తెలిపారు.

సంజామల ఎస్‌ఐ బాధ్యతల స్వీకారం


ఎస్‌ఐ రమణయ్య

సంజామల: మండల ఎస్‌ఐగా రమణయ్య శుక్రవారం బాధ్యతలు తీసుకున్నారు. ఆళ్లగడ్డ నియోజకవర్గం చాగలమర్రి పీఎస్‌లో విధులు నిర్వర్తిస్తున్న రమణయ్య బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు ఆస్కారం లేకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. శాంతి భద్రతల పరిరక్షణకు అందరి సహకారం అవసరమన్నారు. ఎలాంటి సమస్య వచ్చినా నేరుగా పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. అక్రమ రేషన్ బియ్యం, మద్యం విక్రయాలపై కఠినంగా వ్యవహరిస్తామని తెలిపారు.

శాంతి భద్రతల పరిరక్షణకు కృషి


సీఐతో నూతన ఎస్‌ఐ అశోక్

బేతంచెర్ల: మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని బేతంచెర్ల నూతన ఎస్‌ఐ పి.అశోక్ అన్నారు. అసాంఘిక కార్యకలాపాలు, మద్యం, మత్తు పదార్థాల విక్రయాలు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కాగా గతంలో ఇక్కడ పనిచేసిన ఎం.శివ శంకర్ నాయక్ కర్నూలుకు బదిలీ అయ్యారు. పాణ్యంలో పనిచేస్తున్న అశోక్ బదిలీపై బేతంచెర్లకు వచ్చారు. బాధ్యతలు తీసుకున్న అనంతరం సీఐ వెంకటేశ్వరరావును మర్యాద పూర్వకంగా కలిశారు.

400 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం


సారాబట్టీని ధ్వంసం చేస్తున్న పోలీసులు

ప్యాపిలి: మండల పరిధిలోని కలచట్ల శివారు ప్రాంతంలో నాటుసారా బట్టీలపై సీఐ వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు శుక్రవారం దాడులు నిర్వహించారు. 400 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. నాటుసారా బట్టీ నిర్వహిస్తున్న తుగ్గలి మండలం రోళ్లపాడు గ్రామానికి చెందిన కృష్ణానాయక్ పోలీసులను చూసి పారిపోయాడు. అనంతరం అక్కడే ఉన్న 5 లీటర్ల నాటుసారాను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

బనగానపల్లె రూరల్: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎకనామిక్స్ గెస్ట్ ఫ్యాకల్టీ నియామకానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ రాజిక సత్యప్రపూర్ణ తెలిపారు. సంబంధిత సబ్జెక్టులో 55 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించిన వారు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈ నెల 22వ తేదీలోపు కళాశాలలో దరఖాస్తులు అందజేయాలని సూచించారు. 23వ తేదీ ఉదయం 11 గంటలకు ఇంటర్వ్యూ ఉంటుందన్నారు. పూర్తి వివరాలకు కళాశాలలో సంప్రదించాలని తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సంజామల: మండల పరిధిలోని సంజామల, నొస్సం, పేరుసోముల, ఆకుమల్ల సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ దుర్గ శ్రీనివాస్ తెలిపారు. వినియోగదారులు, రైతులు సహకరించాలని కోరారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

బనగానపల్లె రూరల్: విద్యుత్ సబ్‌స్టేషన్లలో మరమ్మతు పనుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ శ్రీనివాసులు శుక్రవారం తెలిపారు. మండలంలోని పాతపాడు, పసుపల, బనగానపల్లె సబ్‌స్టేషన్ల పరిధిలో ఉన్న గ్రామాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. రైతులకు సరఫరా చేసే ఉచిత విద్యుత్ ఉదయం 4 గంటల నుంచి 9 గంటల వరకు, తిరిగి మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 5 గంటల వరకు సరఫరా ఉంటుందన్నారు.

బేతంచెర్ల: పట్టణానికి సమీపంలోని అయ్యలచెర్వు విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతు పనుల దృష్ట్యా శనివారం ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 2:30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్ ఏఈ మహబూబ్‌వలి తెలిపారు. పరిశ్రమల యజమానులు, విద్యుత్ వినియోగదారులు, రైతులు గమనించాలని కోరారు.

'భూ'చోళ్లు

అధికార పార్టీ నాయకులు, రెవెన్యూ అధికారుల అండతో భూ కబ్జాదారులు రెచ్చిపోతున్నారు. ఖాళీ స్థలం కనిపిస్తే చాలు కంచె వేస్తున్నారు. ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి ప్లాట్లు వేసి విక్రయిస్తున్నారు. కొలిమిగుండ్ల మండలంలో సుమారు 70 మందికి ప్లాట్లు విక్రయించి సొమ్ము చేసుకున్నారు. ఖాళీ స్థలాన్ని అనుభవం కింద ఎన్‌ఓసీ ఆధారంగా రిజిస్ట్రేషన్లు చేస్తున్నారు. స్థలాలు కొనుగోలు చేసిన లబ్ధిదారులు నిర్మాణాలు చేసుకుంటున్నారు. రెండు నెలలుగా ఈ తంతు సాగుతున్నా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

- కొలిమిగుండ్లలో యథేచ్ఛగా ప్రభుత్వ భూమి ఆక్రమణ
- ఆపై ప్లాట్లు వేసి రూ.1.50 లక్షల చొప్పున విక్రయం
- వీఆర్వో ఎన్‌ఓసీతో లబ్ధిదారుల పేరిట రిజిస్ట్రేషన్లు
- రెవెన్యూ సిబ్బంది సహకారంతో రెచ్చిపోతున్న కబ్జాదారులు


అమ్మకాలు జరిగిన స్థలంలో నిర్మాణాలు చేస్తున్న దృశ్యం

కొలిమిగుండ్ల: భవిష్యత్ అవసరాలకు ఉండాల్సిన ప్రభుత్వ భూములకు రక్షణ లేకుండాపోతోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కొందరు గ్రూపులుగా ఏర్పడి ప్రభుత్వ భూమిని యథేచ్ఛగా కబ్జా చేసి విక్రయాలు సాగిస్తున్నారు. కొలిమిగుండ్ల కస్తూర్బా పాఠశాల ఎదురుగా 544–డీ జాతీయ రహదారి సమీపంలో ఇటిక్యాల రెవెన్యూ పరిధిలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నిరుపేదలకు సెంటున్నర చొప్పున కొలిమిగుండ్ల, చింతలాయిపల్లె గ్రామాల లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయడంతో ఇళ్ల నిర్మాణాలు చేసుకున్నారు. ప్రస్తుతం జగనన్న కాలనీ మినీ గ్రామంగా తయారైంది. జాతీయ రహదారి పక్కనే కావడంతో స్థలాలకు డిమాండ్ పెరిగింది. ఇదే అదునుగా కొలిమిగుండ్ల, అవుకు మండలాలకు చెందిన కొందరు గ్రూపుగా ఏర్పడ్డారు. చింతలాయిపల్లె కాలనీ పక్కనే ఉన్న 738 సర్వే నంబర్‌లో ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూమిపై వీరి కన్ను పడింది.

ప్లాట్ల ప్రకారం విక్రయాలు

ప్రభుత్వ భూమిని తహసీల్దార్ కార్యాలయంలోని కొంత మందరు రెవెన్యూ సిబ్బందితో కుమ్మక్కై మూడు సెంట్లు ప్లాట్లుగా చేసి విక్రయాలు సాగిస్తున్నారు. ఒక్కో ప్లాటు రూ.1.30 నుంచి రూ.1.50 లక్షల వరకు అమ్మకాలు చేసినట్లు తెలిసింది. సుమారు రెండు నెలల పైగా ఈతంతు సాగుతోంది. కొలిమిగుండ్ల, అవుకు మండలాలతో పాటు అనంతపురం, వైఎస్సార్ కడప జిల్లాలకు చెందిన 70 నుంచి వంద మందికి పైగానే ఇళ్ల స్థలాలు అమ్మినట్లు విశ్వసనీయ సమాచారం. గ్రూపుగా ఏర్పడి ప్రభుత్వ భూమిని అమ్ముకుంటున్న వ్యక్తులు ఇప్పటికే లక్షలాది రూపాయలు సొమ్ము చేసుకున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొందరు వీరి మాయ మాటల్లో పడి లక్షలు చెల్లించి ఇళ్ల స్థలాలు కొనుగోలు చేశారు. రిజిస్ట్రేషన్ తమ పేరిట అయిందనే ఆశతో ఆ స్థలాల్లో నిర్మాణాలు చేసుకుంటున్నారు.


ప్రభుత్వ భూమిలో గుర్తులు వేసిన కబ్జాదారులు

కొనుగోలుదారుల పేరిట రిజిస్ట్రేషన్లు

కబ్జాదారులు కొనుగోలుదారుల పేరిట నిబంధనలకు విరుద్ధంగా అవుకు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేయిస్తున్నారు. ఇప్పటికే వందకు పైగానే రిజిస్ట్రేషన్లు చేయించినట్లు సమాచారం. ఖాళీ ప్రభుత్వ భూమికి రెవెన్యూకు సంబంధించిన వీఆర్వో ఎన్‌ఓసీ (యాజమాన్య హక్కు ధృవీకరణ పత్రం) ఇవ్వడంతో వీటి ఆధారంగా రిజిస్ట్రేషన్లు చేయిస్తున్నారు. వీఆర్వో కాసులకు కక్కుర్తి పడి అడ్డగోలుగా ప్రభుత్వ భూమిపై ఎన్‌ఓసీలు ఇవ్వడంతో కబ్జాదారులు చెలరేగిపోతున్నారు. ప్రభుత్వ భూమిలో పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలంటే లేఅవుట్ వేసి లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పూర్తి చేసి వారి పేరిట ప్రభుత్వమే అధికారికంగా ఇంటి పట్టాలు అందిస్తుంది. కానీ ఇక్కడ నిబంధనలకు విరుద్ధంగా ఖాళీ స్థలాన్ని అనుభవం కింద చూపి ఎన్‌ఓసీ ఆధారంగా రిజిస్ట్రేషన్లు చేసుకుంటున్నారు. నకిలీ పట్టాలు సృష్టించి దొంగ సీలు, సంతకాలు చేసి బాధితులకు పత్రాలు అందించారనే ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వ భూమి అమ్మకాల వెనుక అధికార పార్టీ నాయకుల అండదండలు ఉన్నాయా లేదా అనేది తెలియాల్సి ఉంది. జాతీయ రహదారి పక్కనే ప్రభుత్వ భూమిని విచ్చలవిడిగా అమ్మకాలు చేస్తున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోకపోవడం శోచనీయం.


వీఆర్వో ఇచ్చిన ఎన్‌ఓసీ పత్రం

విచారణ చేస్తాం

ఇటిక్యాల రెవెన్యూ పరిధిలోని ప్రభుత్వ భూమి విక్రయాలపై ఆరా తీస్తాం. ఇటీవలే బాధ్యతలు తీసుకున్నాను. వీఆర్వోపై ఇప్పటికే పలు ఆరోపణలు వినిపించాయి. విచారణ చేయించి చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వ భూమిని రిజిస్ట్రేషన్ చేయించేందుకు వీలు పడదు. పూర్తి వివరాలు తెలుసుకుని చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వ భూమి క్రయవిక్రయాలు చేయడం నేరం. ఎవరూ ఇలాంటి స్థలాలు కొనుగోలు చేసి మోసపోవద్దు.

–బాల ఈశ్వరరెడ్డి, తహసీల్దార్

కౌలు గుర్తింపు కార్డుల ప్రక్రియ వేగవంతం చేయాలి


వ్యవసాయ సిబ్బందికి సూచనలు చేస్తున్న జేసీ విష్ణుచరణ్

బనగానపల్లె రూరల్: కౌలు రైతులకు గుర్తింపు కార్డుల మంజూరు ప్రక్రియ వేగవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్ వ్యవసాయ అధికారులను ఆదేశించారు. శుక్రవారం మండలంలోని ఇల్లూరుకొత్తపేట సచివాలయాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. అక్కడే ఉన్న మండల వ్యవసాయాధికారి సుబ్బారెడ్డితో మండలంలో ఇప్పటి వరకు ఎంత మందికి కౌలు గుర్తింపు కార్డులు ఇచ్చారు? ఇంకా ఎన్ని పెండింగ్ ఉన్నాయి తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం బనగానపల్లె తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లారు. భూ సమస్యలను తహసీల్దార్ నారాయణరెడ్డిని అడిగి తెలుసుకుని పలు సూచనలు చేశారు. ప్రజల నుంచి వచ్చే వినతులను ఎప్పటికప్పుడు విచారించి పరిష్కరించాలని ఆదేశించారు. జేసీ వెంట ఆర్‌ఐ రాఘవేంద్ర ప్రసాద్, వీఆర్వోలు ఉన్నారు.

ప్రజలు మెచ్చేలా రెవెన్యూ సేవలు


రెవెన్యూ సేవలపై సిబ్బందితో మాట్లాడుతున్న జేసీ విష్ణుచరణ్

కోవెలకుంట్ల: ప్రజలు మెచ్చేలా సకాలంలో రెవెన్యూ సేవలు అందించాలని జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్ సూచించారు. శుక్రవారం కోవెలకుంట్ల తహసీల్దార్ కార్యాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. కార్యాలయ రికార్డులు పరిశీలించి ప్రజలకు అందిస్తున్న రెవెన్యూ సేవలను తహసీల్దార్ పవన్‌కుమార్‌రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం వీఆర్వోలు, కార్యాలయ సిబ్బందితో సమీక్షించారు. పలు సూచనలు, సలహాలు అందజేశారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ.. రెవెన్యూ రికార్డులను జాగ్రత్తగా భద్రపరచాలన్నారు. జిల్లాలోని అన్ని తహసీల్దార్ కార్యాలయాలకు ప్రభుత్వం త్వరలో సీసీ కెమెరాలు సరఫరా చేయనున్నట్లు తెలిపారు. వివిధ పనుల నిమిత్తం రెవెన్యూ కార్యాలయాలకు వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా సేవలను అందించాలని సూచించారు. విధులపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. డిప్యూటీ తహసీల్దార్ చంద్రశేఖర్, ఆర్‌ఐ ఇమ్రాన్ ఉన్నారు.

సర్దార్ గౌతు లచ్చన్నకు ఘన నివాళి

బనగానపల్లె రూరల్: స్వాతంత్య్ర ఉద్యమకారుడు, బడుగు బలహీనవర్గాల ఆశా జ్యోతి సర్దార్ గౌతు లచ్చన్న 115 జయంతిని బనగానపల్లె మండల గౌడ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక పోర్‌లైన్ సెంటర్ వద్దనున్న గౌతు లచ్చన్న విగ్రహం వద్ద ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నంద్యాల జిల్లా గౌడ సంఘం అధ్యక్షుడు శేషాద్రిగౌడ్, గౌడ సంఘం నాయకులు నాగశేషన్న గౌడ్, వెంకటేశ్వర్లు గౌడ్, విజయ్‌గౌడ్, తిరుపల్‌గౌడ్ పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులకు ప్రశంసా పత్రాలు

డోన్ టౌన్: నంద్యాల్లో జరిగిన స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల్లో డోన్ మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జయరామ్ సహా మరో నాలుగు విభాగాల్లో డోన్ మున్సిపాలిటీకి అవార్డులు వచ్చాయి. ఇందుకు కారణమైన మున్సిపాల్టీలోని వివిధ విభాగాల్లో పని చేస్తున్న 27 మందిని గుర్తించి మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్, కమిషనర్ జయరామ్‌లు చేతుల మీదుగా శుక్రవారం ప్రశంసా పత్రాలు అందించి అభినందనలు తెలిపారు. ఇలాగా మరిన్ని అవార్డులు వచ్చేలా పనిచేయాలని కోరారు.

ప్రజా సేవే బుగ్గన కుటుంబ ధ్యేయం


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ, వైఎస్సార్‌సీపీ నాయకులు

- డోన్ నియోజకవర్గ అభివృద్ధికి ఎంతో కృషి చేశారు
- వారిని విమర్శించే స్థాయి టీడీపీ నాయకులకు ఎక్కడిది
- ఎంపీపీ బుగ్గన నాగభూషణంరెడ్డి, చైర్మన్ చలంరెడ్డి

బేతంచెర్ల: డోన్ నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసిన ఘనత బుగ్గన కుటుంబానిదేనని ఎంపీపీ బుగ్గన నాగభూషణంరెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి అన్నారు. శుక్రవారం బేతంచెర్లలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి తాత రావుబహదూర్ బీపీ శేషారెడ్డి 1910 డోన్ తాలుక బోర్డు సభ్యుడిగా రాజకీయాల్లోకి వచ్చి అధ్యక్షుడిగా, కర్నూలు జిల్లా బోర్డు అధ్యక్షుడిగా పనిచేశారని గుర్తు చేశారు. మద్రాస్ రాష్ట్రంలో 3 సార్లు ఎమ్మెల్సీగా, జాతీయ స్థాయిలో కూడా ఉన్నత పదవులు అలంకరించారని తెలిపారు. రాష్ట్ర విభజన తర్వాత 1955 నుంచి 1962 వరకు డోన్ ఎమ్మెల్యేగా సేవలందించారన్నారు. బేతంచెర్ల మండలంలోని సిమెంట్ నగర్ గ్రామంలో 1955లో పాణ్యం సిమెంట్ ఫ్యాక్టరీ ఫౌండర్‌గా నిలిచి ఎంతో మంది కార్మికులకు ఉపాధి కల్పించారని తెలిపారు. మండల కేంద్రంలో గుడి, బడి వైద్యశాల ఏర్పాటుకు శేషారెడ్డి కృషి చేశారన్నారు. తాతను ఆదర్శంగా తీసుకుని బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి 1995లో సర్పంచ్‌గా రాజకీయ ప్రస్థానం ప్రారంభించారని తెలిపారు. ప్రజల ఆశీర్వాదంతో 2 సార్లు సర్పంచ్‌గా, ఎమ్మెల్యేగా, పీఏసీ చైర్మన్, ఆర్థిక మంత్రిగా పనిచేశారని పేర్కొన్నారు. విద్య, వైద్యంతోపాటు తాగునీరు, సాగునీరు అందించిన ఘనత బుగ్గనకే దక్కిందన్నారు. డోన్‌ను మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దారని తెలిపారు. ఆయన్ను విమర్శించే స్థాయి టీడీపీ నాయకులకు లేదన్నారు. మూతబడిన పాణ్యం ఫ్యాక్టరీకి పూర్వవైభవం, రూ.350 కోట్లతో గోరుకల్లు రిజర్వాయర్ నుంచి తాగునీరు, డోన్‌లో వంద పడకల ఆస్పత్రి, కేంద్రీయ, గురుకుల విద్యాలయాలు తీసుకొచ్చిన విషయం నిజం కాదా అని ప్రశ్నించారు. టీడీపీ నాయకులు సూపర్ సిక్స్ హామీలు నెరవేర్చి ఆ తర్వాత మాట్లాడాలని హితవు పలికారు. మాట మార్చడం ఆ పార్టీ నాయకులకు అలవాటేనని ఎద్దేవా చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు మూర్తుజావలి, గూని నాగరాజు, మురళీకృష్ణ, యాకోబ్, రామచంద్రుడు, బుగ్గన చంద్రారెడ్డి, బాబుల్ రెడ్డి, కౌన్సిలర్లు చింతల నాగిరెడ్డి, కోట్ల మధు, మధు, ఇబ్రహీం, తదితరులు పాల్గొన్నారు.

వరాలిచ్చే కల్పవల్లి వరలక్ష్మి


పెట్నికోటలో వ్రతం నిర్వహిస్తున్న గిరిస్వామి


డోన్: వైభవ లక్ష్మిగా అలంకరణ


అమ్మవారిశాలలో లక్ష్మీదేవి, వాసవీమాత

- భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతం
- ఆలయాల్లో ప్రత్యేక పూజలు


బేతంచెర్ల: మద్దిలేటిస్వామి క్షేత్రంలో వరలక్ష్మీ వ్రతాన్ని నిర్వహిస్తున్న వేదపండితులు

బేతంచెర్ల: వరాలు ప్రసాదించే వరలక్ష్మీదేవి వ్రతాన్ని మండలంలోని మహిళలు శుక్రవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఆర్‌ఎస్ రంగాపురం శివారులోని శ్రీలక్ష్మీ మద్దిలేటి నరసింహస్వామి ఆలయంలో శ్రావణమాసాన్ని పురస్కరించుకుని సామూహిక వరలక్ష్మీ వ్రతాన్ని నిర్వహించారు. ముందుగా వేదపండితుడు జ్వాలా చక్రవర్తి, ఆలయ ప్రధాన అర్చకులు స్వామి, అమ్మవార్లకు పంచామృతాభిషేకం, తులసిమాలలతో అర్చన, సహస్రనామార్చన చేశారు. శ్రీదేవి, భూదేవి సమేత మద్దిలేటి నరసింహస్వామిని ఊరేగించారు. అనంతరం భక్తుల నడుమ వరలక్ష్మీ వ్రతాన్ని నిర్వహించి వ్రత మహత్యాన్ని వివరించారు. మహిళలు సామూహిక కుంకుమార్చన చేశారు. పూజలో పాల్గొన్న మహిళలకు కలశం, శేష వస్త్రం, పసుపు, కుంకుమ, గాజులు అందజేశారు. మహిళలు పెద్దసంఖ్యలో తరలివచ్చి స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఈఓ రామాంజనేయులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.


మద్దిలేటిస్వామి ఆలయంలో సామూహిక వరలక్ష్మీ వ్రతంలో పాల్గొన్న మహిళలు

- కొలిమిగుండ్ల: మండల పరిధిలోని పెట్నికోటలోని కాశీ విశ్వేశ్వర అన్నపూర్ణ దేవి ఆలయంలో పురోహితుడు గిరిస్వామి ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో వరలక్ష్మి వత్రం నిర్వహించారు. గ్రామంలోని మహిళలు అధిక సంఖ్యలో వ్రతంలో పాల్గొన్నారు. ప్రత్యేక పూజల అనంతరం సంప్రదాయ బద్ధంగా వ్రతాన్ని ఆచరించారు. అనంతరం మహిళలకు తీర్థప్రసాదాలు అందజేశారు.

భక్తిశ్రద్ధలతో వ్రత పూజలు

డోన్ టౌన్: సౌభాగ్యం, కుటుంబ క్షేమంతో పాటు ధనవృద్ధి కోసం నిర్వహించే వరలక్ష్మీ, వైభవ లక్ష్మీ పూజలను శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి బంగారం నగలు, డబ్బులతో ప్రత్యేకంగా అలంకరించారు. పిండి వంటలను నైవేద్యంగా సమర్పించారు. అష్టలక్ష్మీ సహస్రనామావళి పఠిస్తూ ప్రత్యేక పూజలు, మంగళహారతులు ఇచ్చారు. సాయంత్రం ముత్తయిదువులను ఇంటికి ఆహ్వానించి అమ్మవారి పసుపు, కుంకుమ, గాజులు అందజేశారు. అలాగే స్థానిక అమ్మవారిశాలలో ఆర్యవైశ్య మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో సామూహిక వరలక్ష్మీ వ్రతం నిర్వహించారు. ప్రత్యేకంగా మండపం ఏర్పాటు చేసి లక్ష్మీదేవిని, వాసవి మాతను తామర గింజలతో అలంకరించి పూజలు నిర్వహించారు.

అపుస్మా నూతన కార్యవర్గం

బనగానపల్లె రూరల్: స్థానిక ఎస్వీ చైతన్య ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఏపీ అన్ ఎయిడెడ్ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ (అపుస్మా) మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల గౌరవాధ్యక్షుడిగా కె.కొండారెడ్డి, అధ్యక్షుడిగా టి.రామసుబ్బారెడ్డి, సెక్రటరీ ఎం.విశ్వనాథ్‌రెడ్డి, ట్రెజరర్ ఎస్. జిలానిబాషా, జాయింట్ సెక్రటరీ రాంపుల్లయ్య, కమిటీ సభ్యులుగా రాజశేఖర్, భానుప్రకాష్ శ్రీనివాసులు, తిరుమలేష్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ సభ్యులను ప్రైవేట్ పాఠశాల ప్రతినిధులు సన్మానించారు.


నూతన కమిటీ

ఉత్తమ సేవకులకు సత్కారం


అవార్డు గ్రహీతలను సత్కరిస్తున్న మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లు

డోన్: ప్రభుత్వ ఉద్యోగులకు అవార్డులు మరింత బాధ్యతలను పెంచుతాయని మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ అన్నారు. ఆగస్టు 15వ తేదీ స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రభుత్వం నుంచి డోన్ మున్సిపాల్టీకి నాలుగు అవార్డులు రావడం గర్వకారణం అన్నారు. శుక్రవారం మున్సిపల్ సమావేశ మందిరంలో ఉత్తమ సేవా పురస్కారాలు అందుకున్న కమిషనర్ డాక్టర్ జయరాం, డీఈ రసూల్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మొహన్, 11వ సచివాలయ అడ్మిన్ బొజ్జమ్మలను మున్సిపల్ చైర్మన్‌తో పాటు వైస్ చైర్మన్‌లు కొట్రికె హరికిషన్, జాకీర్ హుస్సేన్, కౌన్సిలర్లు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి మున్సిపాలిటీకి సమృద్ధిగా నిధులు విడుదల చేసి అభివృద్ధికి కృషి చేశారని తెలిపారు. ఫలితంగా డోన్ మున్సిపాలిటీకి అరుదైన గౌరవం దక్కిందన్నారు. ఈ అవార్డుతో తమపై మరింత బాధ్యత పెరిగిందని తెలిపారు. మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు మల్లికార్జునరెడ్డి, ఆర్ట్ రమణ, గొల్ల వెంకట్రాముడు, సుంకన్న, షాదిక్, కోఆప్షన్ సభ్యులు రఫీ, కుమ్మరి రాజు, మహిళా కౌన్సిలర్లు మేకల విమల, బద్దల సుబ్బలక్ష్మి, వెంకటేశ్వరమ్మ, శివలక్ష్మి, పాలుట్ల మీనాక్షి, బోయ కళావతి, బోయ సుమలత, మౌలాబీ, ఫాతీమాబీ, ఇంతియాజ్ కాలేషా, సీపీఐ కౌన్సిలర్ సుంకయ్య, నాయకులు కురుకుంద హరి, మేకల రాజు, అశోక్, కాలేషా, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

మచ్చలేని నాయకుడు కోట్ల విజయభాస్కర్‌రెడ్డి


కోట్ల విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే, తదితరులు

డోన్ టౌన్: ప్రజా శ్రేయస్సే ధ్యేయంగా పనిచేసి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా స్థానం సంపాదించుకున్న నేత దివంగత మాజీ ముఖ్యమంత్రి కోట్ల విజయభాస్కర్‌రెడ్డి అని డోన్ ఎమ్మెల్యే కోట్ల జయ సూర్య ప్రకాష్‌రెడ్డి అన్నారు. కోట్ల విజయభాస్కర్‌రెడ్డి జయంతిని పురస్కరించుకుని శుక్రవారం గెస్ట్ హౌస్ ఎదురుగా ఉన్న విగ్రహానికి టీడీపీ నాయకులతో కలిసి ఘన నివాళులర్పించారు. రెండు పర్యాయాలు జిల్లా పరిషత్ చైర్మన్‌గా, ఐదుసార్లు ఎమ్మెల్యేగా, ఆరుసార్లు ఎంపీగా, రాష్ట్ర మంత్రిగా, రెండుసార్లు కేంద్ర మంత్రిగా, ఉమ్మడి ఏపీ ముఖ్యమంత్రిగా పనిచేసి మచ్చలేని నాయకుడిగా నిలిచారని కొనియాడారు. ఆయన ఆశయ సాధన కోసం పనిచేయాలని పిలుపునిచ్చారు.